మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 138 శనివారం 08 - 11 - 2025 పేజీలు: 8 వెల: 4

## దక్షిణ కొరియాలో అంతర్జాతీయ వేదికపై అనంతపురం ప్రతిష్ట



2లో..




## వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు

మన గళం, న్యూఢిల్లీ : దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రాణంలా నిలిచిన జాతీయ గీతం వందేమాతరం 150ఏళ్ల సందర్భంగా రాజధాని ఢిల్లీలో ఘనమైన వేడుకలు జరిగాయి. ఈ చారిత్రక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని, వందేమాతరం పారాయణం మధ్య దేశభక్తి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన "వందేమాతరం 150వ వార్షికోత్సవం కార్యక్రమం మనందరిలో కొత్త శక్తి, కొత్త స్ఫూర్తిని నింపుతోంది" అంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ తన సోషల్ మీడియా 2 లో..

## వందేమాతరం భావాలకు అనుగుణంగా దేశాన్ని వికసించాలి

### - జాతీయ గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రపతి సందేశం



మన గళం, న్యూఢిల్లీ : జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వేళ, దేశప్రజలు ఈ గీతం సందేశానికి కట్టుబడి, భారతమాతను "సుజలాం-సుఫలాం-సుఖదం"గా నిలబెట్టాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. వందేమాతరం జన్మించిన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేస్తూ, ఈ గీతం భారతీయుల భావోద్వేగాలకు, జాతీయ ఐక్యతకు శాశ్వత ప్రతీకగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. వందేమాతరం రచయిత బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సన్యాసి తిరుగుబాటు నేపథ్యంలో ఈ అమరగీతాన్ని సృష్టించారని రాష్ట్రపతి వివరించారు. 1905 స్వదేశీ ఉద్యమం నుంచి ఈ గీతం ప్రజల్లో 2 లో..

## కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు



### - సొంత చెల్లి, మాగంటి తల్లిని కేటీఆర్ మోసం చేశారు

మన గళం, హైదరాబాద్ : బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై తెలంగాణ మంత్రి సీతక్క ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఇటీవల వీరు చేసే వ్యాఖ్యలు, రాజకీయ చురుకుదనం చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటమి భయమైందని స్పష్టమవుతోందని సీతక్క వ్యాఖ్యానించారు. శుక్రవారం 2 లో..

## 300కు పైగా విమానాల రాకపోకలకు అంతరాయం



మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తి, దేశీయ, అంతర్జాతీయ 2 లో..

# స్వదేశీ ముద్దు...విదేశీ వద్దు

### - డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర - విద్యార్థులకు సూచన



(మన గళం,కర్నూలు నరసింహారెడ్డి నగర్) : స్వదేశీ ముద్దు, విదేశీ వద్దంటూ ఏ.పీ.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర విద్యార్థులకు సూచించారు. శుక్రవారం 150 సంవత్సరాల వందే మాతర గీతం సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక నరసింహారెడ్డి నగర్ లో ఉన్న మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విదేశీ వస్తువులకు ప్రాధాన్యమివ్వకుండా, స్వదేశీ వస్తు వినియోగాన్ని



అలవర్చుకోవాలన్నారు. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయ్యాక దేశంలో మత ఘర్షణలు తగ్గిపోయాయన్నారు. మోడీ ప్రధానిగా తీసుకువచ్చిన, తెస్తున్న సంస్కరణలు,జీఎస్టీ నిబంధనల సడలింపులతో దేశానికి విదేశీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అందరూ కలిసి, మెలిసి ఉంటేనే కలదు సుఖమనే వాస్తవాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. కుల,మతాలకు ప్రాధాన్యమివ్వక ముందు మనమంతా మనుషులమనే నిజాన్ని గ్రహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో స్వదేశీ వస్తు వినియోగానికి ప్రాధాన్యమిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నేతలు మంజునాథ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జయశ్రీ,విజయ్,రాజి,రాధ,తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్








మనగళం, ప్రత్యేక ప్రతినిధి : సీఎం చంద్రబాబు నాయుడిని శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కలిశారు. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, భగవాన్ బిర్సా ముండా జయంతి, వందేమాతరం గీతం 150 సంవత్సరాల వేడుకలు, అటల్ బిహారీ వాజపేయి శతజయంతి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే నేతృత్వంలో నిర్వహించడంపై చర్చించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ ప్రధానమంత్రి నరేంద్రమోడీ "మన్ కీ బాత్" పుస్తకాన్ని సీఎం చంద్రబాబుకు బహూకరించారు. అదేవిధంగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కు ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ లో భాగంగా "ప్రతి ఇంటా స్వదేశీ - ఇంటింటా స్వదేశీ " స్టిక్కర్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అందజేశారు. అనంతరం ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయ రాజాను పీవీఎన్ మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## శ్రీచరణి అరైవల్‌కు ఘన స్వాగతం

### - తెలుగు తేజం దేశాన్ని గర్వపడేలా చేసింది : మంత్రి అనిత

2 లో..



# తండ్రి మె(న)చ్చిన తనయ

- విధుల నిర్వర్తణలో 'వి'..జయ..లక్ష్మే
- అన్నదాతల పాలిట అభయప్రదాత
- విధి నిర్వహణలో అదరరుదు బెదరరు ఎవరైనా, ఎందాకానైనా
- మార్కెట్ యార్డుల్లో వినూత్న ఒరవడికి శ్రీకారం
- అనాధల సేవలో తరించాలని యోచిస్తోన్న మానవతావాది
- ఆర్థిక స్వావలంబనే మహిళలకు రక్ష అంటోన్న.. మహిళాభ్యుదయవాది

8 లో..





# వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, "ఇవాళ జరిగిన ఉత్సవంలో పాల్గొనడం గర్వంగా ఉంది. వందేమాతరం భారత జాతిని ఏకం చేసిన గీతం. ఇది కేవలం పాట కాదు, దేశాన్ని లేచేలా ప్రేరణ" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థలు దేశభక్తి గానాలు, నృత్యాలతో సందడి చేశారు. వందేమాతరం రచయిత బంకిమ్ చందర్ చట్టోపాధ్యాయ జీవిత విశేషాలతో పాటు, ఈ గీతం స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్రను ప్రదర్శించే ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సాహితీ ప్రముఖులు వందేమాతరం దేశ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో వందేమాతరం వివిధ భారతీయ భాషల్లో ప్రదర్శించగా, దేశ వైవిధ్యంలోని ఐక్యతను ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థుల భారీ గాన సమూహం స్వరాల్లో మారుమ్రోగిన వందేమాతరం, వేడుక వేదికను దేశభక్తి తరంగాలతో నింపింది. దేశవ్యాప్తంగా కూడా ఈ సందర్భంగా వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు నిర్వహిస్తూ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌గా మారింది. వందేమాతరం తొలి ప్రదర్శన, ఆంధ్రప్రదేశ్%–%తెలంగాణలో జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాల్లో ఈ గీతం ఉన్న ప్రేరణాత్మక చరిత్రను గుర్తుచేసుకుంటూ అనేక రాష్ట్రాల్లో విద్యార్థులు ర్యాలీలు, సాంస్కృతిక శోభాయాత్రలు కూడా నిర్వహించారు. 150 ఏళ్ల తర్వాత కూడా దేశంలో ప్రతీ తరానికి ఈ గీతం ప్రేరణనిస్తుంది. ఈ తరహా వేడుకలు యువతలో జాతీయతాభావాన్ని మరింత బలపరుస్తాయని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# వందేమాతరం భావాలకు అనుగుణంగా దేశాన్ని వికసించాలి

దేశభక్తి జ్యోతి రగిలించిన శక్తిగా నిలిచిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం తర్వాత వందేమాతరాన్ని దేశం జాతీయ గీతంగా గౌరవంగా స్వీకరించింది. దేశ ఐక్యతను ప్రకటించే శక్తి ఈ గీతంలో ఉంది. 150 ఏళ్ల పర్వదినాన మనం అందరం ఈ గీతం భావాలకు అనుగుణంగా దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంకల్పించాలి అని రాష్ట్రపతి సందేశంలో పేర్కొన్నారు. వందేమాతరం భారతీయుల హృదయాలను ఉద్యమపరచిన గీతమని, దేశభక్తి, త్యాగం, ఐక్యత విలువలను తరతరాలకు చేరవేసే బాధ్యత మనందరిదని ఆమె సూచించారు. దేశప్రజలు వికసిత భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్రను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు

మీడియాతో మాట్లాడిన ఆమె, కేటీఆర్ వ్యక్తిగత వ్యవహారాలు, బీఆర్ఎస్ పాలన, హరీశ్ రావు ప్రచారం శైలిని లక్ష్యంగా చేసుకున్నారు. "కేటీఆర్ తన సొంత చెల్లి, మాగంటి తల్లిని కూడా మోసం చేశాడు. 91 ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన అవమానం విచారకరం. మాగంటి తల్లి ఆరోపణలపై కెసిఆర్ స్పందించాలి. తెలంగాణ మహిళలు ఇవన్నీ గమనిస్తున్నారు" అని ఆమె అన్నారు. హరీశ్ రావుపై కూడా సీతక్క విమర్శలు కొనసాగించాయి. "నిశ్శబ్ద విప్లవం అంటూ ఆయన భారీగా చెప్పిన మాటలు 2023 ఎన్నికలలోనే ముంచేశాయి. నిన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న హరీశ్ రావు, ఇప్పుడు ఓటమి భయంతో హడావుడిగా ప్రచారంలోకి వచ్చారు" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలను గుర్తుచేస్తూ సీతక్క మాట్లాడుతూ, "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాలతో రాష్ట్రం దెబ్బతింది. ప్రజలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని పాలన కేసీఆర్‌ది. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ప్రజలకే తిరిగి అందిస్తోంది" అని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఫలితాలు చూపిస్తోందని సీతక్క పేర్కొన్నారు. "ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీతో ప్రజలకు ఊరట కలుగుతోంది. హైదరాబాద్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల గత పదేళ్లలో నగరం వరదలతో ఇబ్బంది పడింది. దీనికి కారణం బీఆర్ఎస్ పాలన పద్ధతి" అని ఆరోపించారు. సీతక్క చేసిన ఈ వ్యాఖ్యలు ఎన్నికల రాజకీయాలకు మరింత వేడి పుట్టించనున్నాయని, ఇదే అంశంపై బీఆర్ఎస్ నాయకుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందో ఆసక్తిగా మారింది.

# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు 91.7% పూర్తి

మన గళం డెస్క్ : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 91.7% పనులు పూర్తయ్యాయని, 2026 జూన్ నాటికి విమానాశ్రయాన్ని దేశానికి అంకితం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్రకు కనెక్టివిటీ, వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటక రంగాల్లో విశేష పురోగతి లభించబోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రాజెక్టు శరవేగంగా సాగుతోందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకు అతి పెద్ద ఆర్థిక, రవాణా కేంద్రంగా రూపొందనున్న ఈ విమానాశ్రయం, అంతర్జాతీయ ప్రయాణాలతో పాటు కార్గో సేవలకు కూడా కీలకంగా మారనుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించనుంది. అరకు, బొర్రా గుహలు, బీచ్‌లు, ట్రైబల్ టూరిజం వంటి ప్రాంతాలకు అంతర్జాతీయ దృష్టి పెరగనుంది. ఉత్తరాంధ్రలో ఉద్యోగావకాశాలు పెరగడంతో పాటు పరిశ్రమలు, హోటల్, ఐటీ, సేవారంగాల్లో పెట్టుబడులు భారీగా ఆకర్షితమయ్యే అవకాశముందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రాభివృద్ధిలో చారిత్రాత్మక మలుపు కానుందని ప్రజాప్రతినిధులు, వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శ్రీచరణి అరైవల్‌కు ఘన స్వాగతం





మన గళం, అమరావతి : ఐసీసీ మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత విజయంలో కీలక పాత్ర పోషించి, విశేష ప్రదర్శనతో దేశాన్ని గర్వపెట్టిన తెలుగు తార శ్రీచరణి స్వదేశానికి చేరుకోగా ఘన స్వాగతం లభించింది. వరల్డ్ కప్ అనంతరం తొలిసారిగా రాష్ట్రానికి చేరుకున్న శ్రీచరణిని గన్నవరం విమానాశ్రయంలో మంత్రి అనిత వంగలపూడి సహా పలువురు నాయకులు, క్రీడా ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అనిత వంగలపూడి మాట్లాడుతూ, "భారత క్రికెట్ చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచే ఈ విజయంలో శ్రీచరణి పాత్ర గొప్పది. ప్రత్యర్థులను మాయ చేసే ఆమె లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ దేశాన్ని ఉర్రూతలూగించింది. మన తెలుగు అమ్మాయి ఇంత పెద్ద వేదికపై దేశం తరఫున మెరిసిన తీరు ప్రతి ఒక్కరికి గర్వకారణం" అని అభినందించారు. వరల్డ్ కప్‌లో 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు సాధించిన రెండో బౌలర్‌గా శ్రీచరణి నిలిచిన విషయం తెలిసిందే. ఆమె ప్రదర్శన టోర్నమెంట్‌లో భారత్ విజయయాత్రకు కీలక మలుపు తిప్పిందని మంత్రి అనిత పేర్కొన్నారు. "ఈ విజయం దేశ బాలికలకు కలలు కనే ధైర్యాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అన్నారు. ఎయిర్‌పోర్టులో జరిగిన సత్కార కార్యక్రమంలో మంత్రి గద్దె శంథ్యారాణి, మంత్రి సావిత్రి, ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని), రాజ్యసభ సభ్యులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ హనరరీ సెక్రటరీ సనా సతీష్ బాబు, టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ పాల్గొన్నారు. శ్రీచరణి విజయాన్ని పురస్కరించుకొని అభిమానులు "జై శ్రీచరణి" నినాదాలతో ఎయిర్‌పోర్టు ప్రాంగణాన్ని మార్మోగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పౌర సత్కారం, ప్రోత్సాహకాలు ఆమెకు మరింత బలం చేకూర్చి, ప్రపంచ క్రికెట్‌లో కొత్త శిఖరాలు చేరుకునేలా ప్రోత్సాహిస్తాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఢిల్లీ విమాన నియంత్రణ వ్యవస్థలో సాంకేతిక సమస్య

విమానాలపై పెద్ద ఎత్తున ప్రభావం చూపింది. ఆటోమేటెడ్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ పనిచేయకపోవడంతో 300కు పైగా విమానాల రాకపోకల్లో ఆలస్యం చోటుచేసుకుంది. ఫలితంగా వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ లోపం ప్రభావం ముంబయి ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా విస్తరించింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముంబయి ఎయిర్‌పోర్ట్ నిర్వహణ ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. ఢిల్లీలోని వ్యవస్థ సమస్య కారణంగా ముంబయిలో కూడా విమాన కార్యకలాపాలు ఆలస్యమవుతున్నాయని పేర్కొంటూ, ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తాజా అప్‌డేట్స్ చూసుకోవాలని సూచించింది. అవసరమైన సమాచారానికి సంబంధిత ఎయిర్‌లైన్‌లను సంప్రదించాలని, అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపింది. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్, ఆకాసా ఎయిర్ వంటి ప్రముఖ ఎయిర్‌లైన్‌లు కూడా తమ విమానాల షెడ్యూల్ ఆలస్యం అవుతున్నట్లు ప్రకటించాయి. రోజుకు 1,500కి పైగా విమానాలు రాకపోకలు సాగించే ఢిల్లీ విమానాశ్రయం దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఎయిర్‌పోర్ట్ కావడం, ఈ సమస్య ప్రభావాన్ని మరింత పెంచింది. వ్యవస్థ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటా పంపిణీ, సమన్వయానికి కీలకంగా పనిచేస్తుంది. ఈ వ్యవస్థలో లోపం రావడంతో విమానాల కదలికలపై నియంత్రణ చర్యలు దెబ్బతిన్నాయని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. సమస్యను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణుల బృందాలు పనిచేస్తున్నాయని తెలిపింది. ఢిల్లీ విమానాశ్రయ కార్యకలాపాలను ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. వ్యవస్థ పునరుద్ధరణను త్వరితగతిన పూర్తి చేసి విమాన రాకపోకలను సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు.




# దక్షిణ కొరియాలో అంతర్జాతీయ వేదికపై అనంతపురం ప్రతిష్ట

**– విలువలు, నిబద్ధత కలిగిన నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి : మేయర్ వసీం సలీం**

**– వరల్డ్ హ్యూమనిస్టిక్ సిటీస్ నెట్‌వర్క్ జనరల్ అసెంబ్లీలో పాల్గొన్న మేయర్**

మన గళం, అనంతపురం : అనంతపురం నగరానికి అంతర్జాతీయ స్థాయిలో మరొక గుర్తింపు లభించింది. దక్షిణ కొరియాలోని యాన్ డాంగ్ నగరంలో జరిగిన వరల్డ్ హ్యూమనిస్టిక్ సిటీస్ నెట్‌వర్క్ జనరల్ అసెంబ్లీలో అనంతపురం నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం పాల్గొన్నారు. ప్రపంచంలోని పలు దేశాలు, రాష్ట్రాలు, నగరాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో మానవత్వం, విలువల ఆధారిత పరిపాలన, పట్టణ అభివృద్ధి, నాయకత్వ నిబద్ధత వంటి అంశాలపై చర్చలు జరిగాయి. మీడియాతో మాట్లాడిన మేయర్ వసీం సలీం, రాజకీయాల్లో విలువలు, నిబద్ధత చరిత్రగా నిలిచే నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసినా దక్కుతుందని భావించే రాజకీయ ధోరణికి విరుద్ధంగా, జగన్ ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని భావించి వ్యవహరించిన విలువైన నాయకుడని పేర్కొన్నారు. "పదవి రాకపోయినా పర్వాలేదు కానీ ప్రజలకు నష్టం కలిగించే హామీ ఇవ్వకూడదనే ధైర్యం, నైతికత జగన్‌లో కనిపిస్తుంది. అలాంటి విలువల నాయకత్వమే నాకు స్ఫూర్తి" అని స్పష్టం చేశారు. ఈ సదస్సులో పాల్గొనే అవకాశం రావడానికి కారణం అనంతపురం ప్రజల మద్దతు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన నాయకత్వ అవకాశమేనని చెప్పారు. అనేక దేశాల ప్రతినిధులతో జరిగిన చర్చల్లో యువతలో విలువలు, నిబద్ధత తగ్గిపోతున్నాయనే అంశం ప్రధాన చర్చగా మారిందని తెలిపారు. విలువలతో కూడిన నాయకత్వం, నైతిక రాజకీయాలు, పారదర్శక పరిపాలన అవసరాన్ని ప్రపంచ ప్రతినిధులు ఈ వేదికపై పంచుకున్నారని చెప్పారు. అనంతపురం నగర అభివృద్ధిలో చేపట్టిన పనులకు ప్రేరణ జగన్ నాయకత్వమేనని మేయర్ పేర్కొన్నారు. "నగరానికి ఈ స్థాయి గుర్తింపు రావడం యాదృచ్ఛికం కాదు. జగన్ ఇచ్చిన అవకాశమే నా రాజకీయ ప్రయాణానికి మూలస్తంభం. నేడు ఈ అంతర్జాతీయ వేదికపై నిలబడ్డాను అంటే, మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర ప్రజల దీవెనల వల్లే సాధ్యమైంది" అని అన్నారు. నాయకులు రాజకీయాలు చేస్తారు కానీ విలువలతో కూడిన రాజకీయాలు చేసే నాయకులు గొప్పవారని పేర్కొన్న మేయర్ వసీం సలీం, జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అభిప్రాయపడ్డారు. ముందుకు కూడా అదే విలువలతో ప్రజలకు సేవ చేయడం తన లక్ష్యమని చెప్పారు.



# ఏపీవాసులకు శుభవార్త


మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రైలు ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ శుభవార్త అందించింది. చెన్నై సెంట్రల్ – విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవను నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారిక ఆదేశాలు జారీ అయ్యాయి. త్వరలోనే విస్తరించిన సేవ ప్రారంభం కానుంది. వందే భారత్ సేవ విస్తరణతో గుడివాడ, భీమవరం, నరసాపురం ప్రాంతాలకు మెరుగైన రైల్వే కనెక్టివిటీ లభించనుంది. ప్రత్యేకించి, కోనసీమ, గోదావరి జిల్లాల ప్రయాణికులకు ఇది పెద్ద ఉపశమనం, అలాగే విద్య, వ్యాపారం, పర్యటనలకు ప్రయాణ సౌకర్యం పెరుగనుంది. ప్రస్తుతం ఉదయం 5.30 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరే వందే భారత్ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి మీదుగా మధ్యాహ్నం 12.10కు విజయవాడ చేరుతుంది. పొడిగింపు తర్వాత ఈ రైలు 11.45కే విజయవాడకు చేరుకుని, 11.50కు నరసాపురం వైపు ప్రయాణం కొనసాగిస్తుంది. గుడివాడకు మధ్యాహ్నం 12.25కి, భీమవరంకు 1.30కి, నరసాపురానికి 2.10కి చేరుతుంది తిరుగు ప్రయాణంలో నరసాపురం నుండి మధ్యాహ్నం 2.50కు బయలుదేరి భీమవరం (3.20), గుడివాడ (4.10) చేరుకుని, 4.50కు విజయవాడకు రానుంది. అక్కడి నుంచి 4.55కు ప్రారంభమై తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా రాత్రి 11.45కు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# వాట్సప్ గవర్నెన్స్ సేవలపై అవగాహన కల్పించాలి

– ప్రతి శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించండి – కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి

మనగళం, కర్నూలు సిటీ : ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్ సేవలకు అవగాహన కల్పించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వాట్సప్ గవర్నెన్స్ సేవల ప్రయోజనాలను వివరించాలని, ఈ సేవలను వందశాతం కుటుంబాలు వినియోగించుకునేలా చైతన్య పరచాలని ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీఓ లు చర్యలు తీసుకోవాలని, జడ్పీ సీఈవో, డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారులు(డీఎల్డీవో లు) పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాట్సప్ సేవలు ఎలా వినియోగించుకోవాలి అని డెమో(ప్రదర్శన) చేసి, వారితో ఒక సర్వీస్ అయినా చేయించాలన్నారు. అలాగే ఆ సర్వీస్ కు సంబంధించిన ఫోటోలను ఎంప్లాయి మొబైల్ అప్లికేషన్ లో అప్లోడ్ చేయాలన్నారు. క్యూ ఆర్ కోడ్ లు డిస్ప్లే చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, ఇతర సచివాలయ సిబ్బందితో సమన్వయపరచుకుని, అన్ని కుటుంబాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వీఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డ్ రెవెన్యూ సెక్రటరీలు వాట్సఅప్ గవర్నెన్స్ ద్వారా అందుతున్న రెవెన్యూ, భూ సంబంధిత సేవల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎనర్జీ అసిస్టెంట్స్, ఎనర్జీ సెక్రటరీలు విద్యుత్ శాఖకు సంబంధించి బిల్లు పేమెంటు, కొత్త కనెక్షన్, తదితర అంశాల మీద అవగాహన కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయం, ఉద్యాన శాఖ, సెరికల్చర్,పశుసంవర్ధకం, ఫిషరీస్, ఏఎన్ఎం, వార్డ్ హెల్త్ సెక్రటరీలు ఆయా శాఖలకు సంబంధించి వాట్సప్ గవర్నెన్స్ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులభంగా ఆన్లైన్ ద్వారా సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని, వంద శాతం కుటుంబాలు ఈ సేవలను వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా రాణించాలి



మనగళం, కర్నూలు సిటీ : పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని లయోలా కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 8 తేదీ నుంచి 9 తేదీ వరకు జరగబోయే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టుకు ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ అలీమ్ భాష క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. క్రీడలు మన జీవితంలో ఒక భాగం కావాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుబేర నాయుడు , సంయుక్త కార్యదర్శి అయ్యన్న గౌడు , కార్యవర్గ సభ్యుడు శాంతరాజ్ హాజరైనట్లు జిల్లా సాఫ్ట్ బాల్ కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు.

# ఉపాధి హామీ, సాగునీటి రంగాలపై దృష్టి సారించండి

– హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా చెరువులను నింపండి – జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి





మనగళం, కర్నూలు సిటీ : ఉపాధి హామీ పథకం కింద పనులు లేని వారందరికీ ఉపాధి కల్పిస్తూ, రైతులకు ప్రయోజనకరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు%-%నంద్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖుమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద రైతుల పొలాలకు రహదారులు, కాలువల పూడికతీత పనులు వంటికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అవుకు రిజర్వాయర్లో 4 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రస్తుతం 2.5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. పెండింగ్లో ఉన్న అండర్ కాంక్రీట్ పనులను వేగవంతం చేసి పూర్తిచేసి, పూర్తి సామర్థ్యంతో నీటిని నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే హంద్రీ%-%నీవా ప్రధాన కాలువ నుండి ఇంకా 45 చెరువులకు నీరు నింపాల్సి ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్హెచ్%-%340సి హైవే నిర్మాణం కారణంగా బ్రాహ్మణకొట్కూరు%-%దిగువపాడు ప్రాంత రైతుల దాదాపు 2,500 ఎకరాల పొలాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నారని సభ్యులు తెలుపగా తగిన పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మిడ్తూరు మండలం జెడ్పీటీసీ సూచించిన జలకనూరు, మద్దిలేరు వాగు మరమ్మత్తుల కోసం రూ.44 లక్షలు మంజూరు అయ్యాయని వివరించారు. మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో, ఇప్పటివరకు 67 వేల హెక్టార్ల వరి, 65 వేల హెక్టార్ల మొక్కజొన్న సాగు జరిగిందని, అందులో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కోతకు వచ్చినప్పటికీ, అధిక తేమ శాతం కారణంగా 30 మెట్రిక్ టన్నులు పాడవ్వడం జరిగిందని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో 11,448 హెక్టార్ల పంట దెబ్బతిన్నదని, అందులో 4,297 హెక్టార్ల మొక్కజొన్న, 6,384 హెక్టార్ల వరి పంటలు నష్టపోయాయని చెప్పారు. సంబంధిత వివరాలతో నష్టపరిహార నిమిత్తం సంపూర్ణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించామని కలెక్టర్ తెలిపారు. ఎన్డిఎల్%-%9 రకం వరి పంట సాగు చేసిన రైతులు తేమ తగ్గిన తర్వాత ప్రభుత్వ మద్దతు ధరకంటే ఎక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉందని, రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. బ్రాహ్మణకొట్కూరు%-%వడ్డెమాను రహదారిపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పూడికను రోడ్డుపై వేసి రాకపోకలకు ఆటంకం కలిగించారని, సంయుక్త తనిఖీలు జరిపి తక్షణ పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తుపాను కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం విడుదల చేసే నష్టపరిహారం కౌలు రైతులకు కూడా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన అంశాలు**

2025%-%26 ఆర్థిక సంవత్సరానికి కర్నూలు జిల్లా ప్రజా పరిషత్తు సాధారణ నిధుల నుంచి వివిధ కాంపోనెంట్ల క్రింద 137 పనులు రూ.586.03 లక్షల అంచనాతో ఆమోదం పొందాయి. ఆత్మకూరు మండలం సున్నిపెంట గ్రామ పంచాయతీ క్లాప్ మిత్రులకు 7 నెలల వేతనాల కోసం రూ.16.80 లక్షలు విడుదల చేయడానికి ఆమోదం లభించింది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో గడువు ముగిసిన 77 పనులు (రూ.352.35 లక్షల విలువైనవి) రద్దు చేయబడ్డాయి. జిల్లాలోని 59 సి.పి.డబ్ల్యూయస్ పథకాలు టెండర్ ప్రక్రియ పూర్తయి కొనసాగుతున్నాయి.జిల్లా పరిషత్తు నూతన భవనంలో లిఫ్ట్ సదుపాయం కల్పించేందుకు రూ.25 లక్షలు 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి మంజూరయ్యాయి.

## అభివృద్ధి పనులకు భూమి పూజ



మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ 28 వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామంలో అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి భూమి పూజ చేశారు. రూ. 49 లక్షల వ్యయంలో నిర్మించనున్న సీసీ, రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే భూమి చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, అర్బన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలక్ష్యం చూపొద్దు

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలక్ష్యం చూపరాదని, ప్రజల పట్ల నిబద్ధత, బాధ్యతతో వ్యవహరించాలని నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడు సూచించారు. శుక్రవారం ఆయన కుమ్మరి గేరి 9, 10, 11వ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. హాజరు పట్టిక, మూమెంట్, వివిధ రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని, ప్రజా సేవల్లో జాప్యం చేయొద్దని హెచ్చరించారు.

## కావేరి ట్రావెల్స్ యజమాని వినోద్ కుమార్ అరెస్టు

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు జిల్లా, ఉలిందకొండ పియస్ పరిధిలోని కల్లూరు మండలం, చెట్లమల్లాపురం సమీపాన 44 వ జాతీయ రహదారి పై వి కావేరీ ట్రావెల్ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు వి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్, ఓనర్ పై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అధికారి పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య ఈ కేసును క్షుణ్ణంగా విచారించారు. ఈ సంఘటనలో మొదటి నిందితుడైన మిరియాల లక్ష్మయ్య ను 2025 అక్టోబర్ 28 తేదీన కర్నూలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టడం జరిగింది. అదే విధంగా ఈ కేసు లో రెండవ ముద్దాయి వి కావేరీ ట్రావెల్స్ బస్సు ఓనర్ అయిన వేమూరి వినోద్ కుమార్ ను శుక్రవారం ఉదయం 07.30 గంటలకు కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసులు ముద్దాయిని జేఎఫ్ సీఎం, స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరిచారు.

## కార్మికులకు అండగా సీఐటీయూ

మనగళం, నంద్యాల : నంద్యాల పట్టణంలోని కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి, కార్మికులకు సీఐటీయూ అండగా ముందుండి పోరాటం నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షులు కే. మహమ్మద్ గౌస్, కార్యదర్శి పి. వెంకట లింగం తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం పట్టణ మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ కార్యదర్శిగా పి వెంకట లింగం, అధ్యక్షులుగా మహమ్మద్ గౌస్, కోశాధికారిగా సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, సునీత, ఈశ్వరమ్మ, బాలదుర్గన్న, సహాయ కార్యదర్శులుగా పుల్లా, నరసింహులు, గోపాల్, పద్మ, ఆంజనేయులును ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు కే. మహమ్మద్ గౌస్, పి. వెంకట లింగం లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు.

# ఊపందుకున్న ఏపీ బార్ కౌన్సిల్ ఎలక్షన్ ప్రచారం




మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సెల్ ఎలక్షన్ ప్రచారం ఊపందుకుంది. బార్ కౌన్సిల్ మెంబెర్ గా పోటీ చేస్తున్న హై కోర్ట్ ప్రభుత్వ న్యాయవాది యలమంజుల బాలాజీ శుక్రవారం కర్నూలు జిల్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు త్వరలో హై కోర్టు వస్తుందని, అందుకు కూటమి ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదే విధంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలో పెండింగ్ లో ఉన్న అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్ త్వరలో పాస్ అయ్యే అవకాశం ఉందన్నారు. అడ్వకేట్స్ కి పది లక్షల రూపాయలు హెల్త్ ఇన్సూరెన్సు, జూనియర్ అడ్వకేట్స్ కి నెలకి రూ. 10 వేలు, వారికి లైబ్రరీ కొరకు యాభై వేల రూపాయలు లోన్ అందుతుందన్నారు. సరైన ఆధారాలు లేకుండ అడ్వకేట్స్ పై అనవసరమైన కేసులు పెట్టి విచారణ చేయకుండా ఉండే విధంగా బార్ కౌన్సిల్ లో మార్పులు చేయుటకు తన వంతు బాధ్యత తీసుకొంటానని అన్నారు. తనకు సహకరించిన బార్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ హరినాథ్ చౌదరి, వెంకటేష్ తోపాటు సీనియర్ న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు షాబుద్దీన్, బలరాం, విక్రమ్ సింగ్, లోకేష్, శంకర్ సింగ్, దస్తగిరి, రంగనాథం, శ్రీనివాస బట్టు, కోటి యాదవ్, మురళి, సురేష్ తదితరులు యలమంజుల బాలాజీకి మద్దత్తు తెలిపారు.



# సామాన్యులను సమరయోధులుగా మార్చిన వందేమాతరం గీతం

**– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**





మనగళం, కర్నూలు క్రైం : వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో సామాన్యులను సైతం సమరయోధులుగా మార్చిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. జాతీయ గేయం ను రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో సాముహికంగా పోలీసులు వందేమాతరం జాతీయ గేయాన్నిఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయత భావాన్ని పెంపోందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ , కర్నూల్ డీఎస్పీ బాబు ప్రసాద్, హెూంగార్డు డీఎస్పి ప్రసాద్, డీపీఓ ఏఓ విజయలక్ష్మీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు , ఆర్ ఎస్సైలు, పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయం



మనగళం, కర్నూలు సిటీ : వందేమాతరం గేయం భారతీయుల్లో స్ఫూర్తి నింపిందని ఆసుపత్రి అడిషనల్ డీ ఎం ఈ, సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వందేమాతరం గేయం రచించి150 ఏళ్లు పూర్తయ్యాయిన సందర్భంగా శుక్రవారం పెద్దాసుపత్రి ఆవరణలో వైద్యులు, వైద్య సిబ్బంది వందేమాతరం గేయాలాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారన్నారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డా.వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, డా.శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, డా.సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరిండెండెంట్, సావిత్రిబాయి, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోగులు, సిబ్బంది ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అటువంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోసినట్లయితే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. బయో మెడికల్ వేస్ట్ సొల్యూషన్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రతినిధితో వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నాలుగు వాహనాల ద్వారా అన్ని ఆసుపత్రుల నుండి వేస్ట్ కలెక్ట్ చేసుకుని నిర్వీర్యం చేస్తామని ప్రతినిధి కలెక్టర్ కు తెలియజేశారు. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ను ఫోన్ ద్వారా ఏ విధంగా బయోమెడికల్ వేస్ట్ ను నిర్వీర్యం చేస్తున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రుల చెత్తను సరైన విధంగా వేరు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. రెడ్, యెల్లో, బ్లూ, వైట్ రంగుల బయో కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజెక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను వేర్వేరు సంచుల్లో వేరు చేయాలని సూచించారు.ఇది వ్యర్థాల శాస్త్రీయ నిర్వాహణకు కీలకమని కలెక్టర్ అన్నారు. అదేవిధంగా, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే బయోమెడికల్ వ్యర్థాల వివరాలను బయోమెడికల్ వేస్ట్ మానేజ్మెంట్ యాప్ లో ప్రతిరోజూ డేటా ఎంట్రీ చేయడం తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ "చెత్తను వేరు చేసే ముందు ఆలోచించండి" అనే గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్, చంద్రమోహన్ రెడ్డి పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ,డాక్టర్ జఫ్రుల్లా డిసిహెచ్ఎస్,డాక్టర్ వెంకటేశ్వర్లు జి జి హెచ్ సూపరింటెండెంట్ , డాక్టర్ వేణుగోపాల్ ఐఎంఏ ప్రతినిధి, కర్నూలు ఆదోని, ఎమ్మిగనూరు,గూడూరు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వందేమాతరం ఆత్మవిశ్వాసానికి నినాదం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : వందేమాతరం గేయ శబ్దం విన్నప్పుడు ప్రతి భారతీయుడులో ఆత్మవిశ్వాసం నింపుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ అన్నారు. భారతీయ జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నగరపాలక కార్యాలయంలో ఉద్యోగులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. దేశాన్ని ఏకం చేసి, పర పీడనను తరిమికొట్టిన తారక మంత్రం వందేమాతరం గీతం అని కొనియాడారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు ఈ గీతాన్ని ఆలపించి నాటి నుంచి నేటి వరకు దేశభక్తిని చాటుకున్నారన్నారు. బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన ఈ గేయం, స్వదేశీ ఉద్యమానికి ఊపిరిగానూ నిలిచిందన్నారు. 1908లో ఉరిశిక్షకు గురైన యువ సమరయోధుడు కుదిరామ్ బోస్ చివరి మాటగా న్యాయమూర్తిని ఉద్దేశించి తల అడ్డంగా ఊపి, 'వందేమాతరం' అంటూ చిరునవ్వుతో ఉరికొయ్య వైపు నడిచారని, ఆ వీరుడి భౌతికకాయాన్ని తీసుకెళ్తున్నప్పుడు కోల్కత్తా వీధులు ప్రజల "వందేమాతరం" నినాదాలతో హెూరెత్తిపోయాయి. ఈ గీతం ఉద్యమకారులకు మనోధైర్యాన్నిచ్చి, సామాన్య ప్రజలను సైతం సమరయోధులుగా మార్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఆర్వో జునైద్, సిబ్బంది కృష్ణమోహన్, శ్రీదేవి, శోభరాణి సరస్వతి, నాగరాజు, శ్రీనివాసులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతర గీతంతో బీజేపీ ఉత్సవాలు విడ్డూరం



**– మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు**

మనగళం, కర్నూలు సిటీ : వందేమాతర గీతంపై బీజేపీ నాయకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు ఎద్దేవా చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జరిగిన సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడారు. వందేమాతర గీతాన్ని బకింగ్ చంద్ర చటర్జీ స్వాతంత్ర ఉద్యమంలో 150 సంవత్సరాల క్రితం గీతాన్ని రచించారని, స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు ఈ దేశభక్తి గీతాన్ని ప్రజలలోనికి తీసుకుపోయారని గుర్తు చేశారు. అయితే ఏనాడూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ చర్య ముమ్మాటికీ బీజేపీ జిమ్మిక్కులేనని, స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఒక్క బీజేపీ నాయకుడి పేరు చెప్పాలని డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆరాధ్య నాయకుడు అంటున్నారని, ఆయన మా కాంగ్రెస్ నాయకుడేనని, జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మొదటి హెూం మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో అరెస్సెస్ నాయకులు పాల్గొనలేదని, హిందుత్వం పేరుతో అధికారం కోసం హిందుత్వాన్ని పోషిస్తున్నారని విమర్శించారు. దేశం ఐక్యంగా ఉండాలని, దేశ పౌరులందరూ సుఖంగా ఉండాలని, అధికారం ఉన్నా లేకున్నా దేశ ప్రజల కోసం దేశ సార్వభౌమత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని సుధాకర్ బాబు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, ఐ ఎన్ టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు డబ్ల్యు సత్యరాజు, బి సుబ్రహ్మణ్యం, హుస్సేన్ మొదలగువారు పాల్గొన్నారు.

## నాలుగో రోజూ బంగారం ధర తగ్గుముఖం

న్యూఢిల్లీ, నవంబర్ 7, మనగళం,దేశంలో బంగారం ధర కొంచెం.. కొంచెంగా అక్కరకొస్తోంది. గత మూడు రోజులుగా తగ్గుతూ వస్తున్నబంగారం ధరలు నేడు నాలుగో రోజు కూడా తగ్గాయి. దీపావళి తర్వాత నుంచి తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు నేడు వరుసగా నవంబర్ 7వ తేదీ శుక్రవారం కూడా తగ్గాయి.దీపావళికి 1,31,000 రూపాయలు పలికిన బంగారం ధర ఇప్పుడు, తులంపై దాదాపు 9 నుంచి 10వేలు తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల (999) స్వచ్ఛమైన బంగారం ధర గ్రాముకు రూ. 12,202 వద్ద ఉంది. ఇది నిన్నటి ధర రూ.12,257 కంటే రూ.55 తగ్గింది.అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.11,188 వద్ద నడుస్తోంది. నిన్నటి కంటే రూ.47 తగ్గింది. ఇక, 18 క్యారెట్ల బంగారం ధర కూడా కాస్త తగ్గి, గ్రాముకు రూ.9,152 వద్ద ఉంది.

# వందేమాతర గీతం భారతీయతను ప్రతిబింభించిన నినాదం





**– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి**

మనగళం, కర్నూలు సిటీ : వందేమాతరం150 ఏళ్ల సంస్మరణోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు లో కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతం ఆలాపన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి మాట్లాడుతూ వందేమాతర గీతం భారత ఆత్మను ప్రతిబింబించిన నినాదం అని, అది జాతిని మేల్కొలిపిన శక్తి అని తెలిపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమర యోధులుగా మార్చిందని,ఈ పాట భారత మాత స్ఫూర్తిని ప్రతి బింభిస్తుందని, భారత ప్రజల ఐక్యతను, వైవిధ్యాన్ని చాటుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు జాతీయత భావాన్ని పెంపోందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ , జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, ఆర్ ఐ ఓ లాలప్ప , మున్సిపల్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది , ఎన్ సి సి విద్యార్థులు, స్కౌట్స్, గైడ్ విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శనివారం
08 - 11 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

**సోషల్ మీడియాలో మోసాలపై అవగాహన అవసరం**

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా మన జీవితాల్లో తప్పనిసరి భాగమైంది. సమాచారాన్ని పంచుకునే వేగం పెరిగి ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. కానీ అదే వేదిక మరొక రూపంలో మోసాలకు, దందాలకు ఆదర్శ వేదికగా మారిపోతుండడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది.

గత కొన్నేళ్లలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరగడం తోపాటు, మోసాల రకాలు కూడా అతి వేగంగా మారుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్రతి వేదికను లక్ష్యంగా చేసుకుని నకిలీ అకౌంట్లు, వ్యాపార అవకాశాల పేరుతో స్కామ్‌లు, లక్కీ డ్రా మోసాలు విస్తరిస్తున్నాయి. విశ్వాసం, అమాయకత్వం, ఆసక్తి ఇవే మోసగాళ్ల ఆయుధాలు.

ఇటీవలి కాలంలో "రీల్స్ ద్వారా సంపాదన", "రెఫరల్ ఇన్‌కమ్", "క్రిప్టోలో పెట్టుబడి పెడితే 24 గంటల్లో రెట్టింపు" వంటి స్కామ్‌లు యువతను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. పనికోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని అమ్మకాలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. చాలా మంది ఇవన్నీ నిజమని భావించి తమ సొమ్మును కోల్పోతున్నారు.

సాంకేతిక విజ్ఞానం అందరికీ చేరడం ఒక పురోగతి. అయితే దాని వినియోగంపై అవగాహన లేకపోవడం ప్రమాదానికి దారితీస్తోంది. ఒక లింక్‌ను క్లిక్ చేయడం, ఒక ఫోటోను షేర్ చేయడం, ఒక ఫార్వర్డ్ మెసేజ్ నమ్మడ చిన్న తప్పిదాలతో ప్రజలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ %ూూ, ఖూ×% పిన్, ఆధార్, పాన్ వంటి వివరాలు తెలియకుండానే పంచడం మోసాలకు దారి తీస్తుంది.

సైబర్ క్రైమ్ విభాగాల నివేదికలు చూస్తే దేశవ్యాప్తంగా సోషల్ మీడియా మోసాల కేసులు గత ఏడాదితో పోల్చితే రెట్టింపు అయ్యాయి. పోలీసులు నిత్యం హెచ్చరికలు చేస్తున్నా అవగాహన లోపం ఇంకా కొనసాగుతోంది. నగరాల్లో చదువుకున్నవారికి కూడా మోసాలు జరుగుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత భయంకరంగా మారుతోంది.

ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే చిన్న వయస్సు నుంచే డిజిటల్ లిటరసీ అనేది విద్యలో ఒక భాగం కావాలి. పాఠశాలలు, కళాశాలల్లో సోషల్ మీడియా వినియోగం, వ్యక్తిగత డేటా ప్రైవసీ, మోసాల గుర్తింపు, చెక్‌లిస్ట్ వంటి అంశాలను బోధించే ప్రత్యేక పాఠాలు ప్రవేశపెట్టాలి. సోషల్ మీడియా ఎంత ఉపయోగకరమో, అంత ప్రమాదకరమయ్యే అవకాశమూ ఉందని యువతకు తెలిసి ఉండాలి.

సోషల్ మీడియా మోసాలను అరికట్టడంలో ప్రభుత్వం, టెక్ కంపెనీలు, సాధారణ ప్రజలు.. ఈ ముగ్గురి పాత్ర సమానంగా ఉంది. ప్రభుత్వం బలమైన సైబర్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పరచాలి. టెక్ కంపెనీలు నకిలీ అకౌంట్లను ఆపేందుకు కఠినమైన ధృవీకరణ వ్యవస్థను అమలు చేయాలి. ఫిషింగ్ లింకులు, బాట్ అకౌంట్లు, నకిలీ పేజీలపై వేగంగా చర్యలు తీసుకోవాలి.

ఇదిలా ఉండగా, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. "తెలియని వ్యక్తి నుంచి వచ్చిన మెసేజ్‌ను నమ్మొద్దు", "అనుమానం ఉన్న లింక్‌ను క్లిక్ చేయొద్దు", "అత్యంత లాభం అనే మాటపై నమ్మకం పెంచొద్దు" ఈ మూడు నియమాలు మోసాలను నివారించడానికి ప్రాథమిక రక్షణ చట్రం. సోషల్ మీడియాలో ఏది చూసినా వెంటనే విశ్వసించకుండా ఆలోచించే అలవాటు పెంచుకోవాలి.

డిజిటల్ ప్రపంచం మనకు అపారమైన అవకాశాలు ఇచ్చినప్పటికీ, జాగ్రత్త లేకపోతే వాటి వెనుక భారీ ప్రమాదాలూ దాగి ఉన్నాయి. వర్చువల్ ప్రపంచంలో ఒక్క క్షణం నిర్లక్ష్యం నిజ జీవితంలో తీవ్రమైన ఆర్థిక, వ్యక్తిగత నష్టాలకు దారితీస్తోంది. అందుకే సోషల్ మీడియా వినోదమైనా, సమాచారం వేదికైనా అది జాగ్రత్తగా, తెలివిగా వినియోగించాలనే చైతన్యం పెంపొందించాల్సిన సమయం ఇది.

సమాజం మొత్తం డిజిటల్ అవగాహనను ఒక ఉద్యమంలా తీసుకుంటేనే సోషల్ మీడియా మోసాలకు పూర్తిస్థాయి అడ్డుకట్ట పడుతుంది. లేకపోతే టెక్నాలజీ మనకు రక్షణ కవచం కాకుండా, ప్రమాదానికి మార్గదర్శకమవుతుంది.

## స్వయం సహాయక సంఘ మహిళలకు డిఆర్డిఏ వెలుగులోని వివిధ రకాలపథకాల ద్వారా పశువులు కొనుగోలుకు10 కోట్ల రుణాలు మంజూరు

మన గళండోన్ మండలంలోని పొదుపు లక్ష్మీ మహిళలకు డిఆర్డిఏ వెలుగు శాఖలోని వివిధ రకాల పథకాల ద్వారా పాడి పశువులు, గొర్రెలు, మేకల యూనిట్లు మరియు పొట్టేలు పిల్లల పెంపకంయూనిట్లు, దాదాపుగా 10 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగింది. ఈ యొక్క యూనిట్లను పక్కగా లబ్ధిదారులకు అందించి వారి యొక్క జీవ నోపాధ మెరుగుపడాలని ఉద్దేశంతో పేదరిక నిర్మూలన సంస్థ మరియు పశు సంవర్ధక శాఖ సమవ్యయము తో గ్రామంలోని లబ్ధిదారులకు సమీక్ష సమావేశంలు పెట్టి పశువులు కొనుగోలును సంతలలో గాని, పక్క జిల్లాలను గాని, సొంత జిల్లాలలో గాని పక్క మండలాలలో గాని మహిళలకు ఇష్టప్రకారం కొనుగోలు చేయాలని, పేదరిక నిర్మూలన పథకం ముఖ్య ప్రణాళిక అధికారి. కరుణ ఐఏఎస్ మరియు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్. దామోదర్ నాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో సమీక్ష సమావేశంలు పెట్టి లబ్ధిదారులకు పశువుల యూనిట్లు అందజేయాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ఇందులో భాగంగా 07-11-2025వ తేదీన ఎర్రగుంట్ల గ్రామంలో స్థానిక రైతు సేవ కేంద్రంలో లబ్ధిదారులైన మహిళలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడమైనది .ఈ సమీక్ష సమావేశం కు డాక్టర్ ఆర్ నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్, చంద్రిక నంద్యాల జిల్లా శ్రీ నిధి మేనజర్ పశు వైద్యురాలు గౌసియ బేగం, చంద్రిక నంద్యాల జిల్లా శ్రీ నిధి మేనజర్ ,సర్పంచ్ గిడ్డయ్య, సి సి శేకర్ లక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ ఆర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామాల వారీగా వివిధ రకాల పశువుల యూనిట్లను వివరాలుపెట్టడం జరిగినది. గ్రామంలోని సిసి మరియు వివోఏ కలిసి లబ్ధి దారులను గుర్తించి, ఒక సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ ఆ సమావేశానికి వెళ్లి వాళ్లకు ఎక్కడ పశువులు కొనుగోలు చేయాలి ఎ రకమైన పశువులను కొనాలి అనే దాని గురించి శిక్షణ ఇచ్చి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆ తర్వాత పశువులకు బీమా చేయడం జరుగుతుందని తెలిపారు. పశువులను కొనుగోలు చేసిన తర్వాత వాటి ఆరోగ్యము మరియు వ్యాధి నివారణ టీకాల గురించి డాక్టర్లు బాధ్యత తీసుకోవాలనితెలిపారు. పశువులు కొనుగోలు చేసిన తర్వాత దాణా,పచ్చి గడ్డి కోసం మహిళలకు ద్వారా లోన్లు ఇపించడం జరుగుతుంది జరుగుతుంది అని తెలిపారు. ఈ యెక్క పశువుల యూనిట్ లను అక్టోబర్ ,నవంబర్ ,డిసెంబర్ లోపల లబ్దిదారులకు అందిచాలి అని సిబంద్ది కి ఆదేశించడమై నది.





## మరణించిన మునిసిపల్ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలి సిఐటియు

మన గళండోన్ మున్సిపాలిటీ నందు పనిచేస్తూ మరణించిన పారిశుధ్య,ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు టి. శివరాం,నక్కీ శ్రీకాంత్,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ గారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డోన్ మున్సిపాలిటీ నందు పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులుగా పనిచేస్తూ ముగ్గురు కార్మికులు మరణించారని,ఆప్కాస్ లో ముగ్గురు కార్మికులు రిటైర్మెంట్ అయ్యారని వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేసిన 17 రోజుల రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం కార్మికులకు కొన్ని హామీలు మినిట్స్ రూపంలో ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 2,00,000 రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి,అర్హతలు కలిగిన వాహన డ్రైవర్లకు 24,500 రూపాయలు వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వం జీవోలు కూడా విడుదల చేసిందని వారు అన్నారు. అదేవిధంగా పిఎఫ్,ఈఎస్ఐ లలో సమస్యలు ఉన్నాయని ఇప్పటికైనా త్వరితగతిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొని కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆవులయ్య,వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సమరయోధులుగా మార్చిన వందేమాతరం గీతం



మనగళం, కోడుమూరు : వందేమాతరం గీతం సామాన్యులను సైతం స్వాతంత్ర్య సమరయోధులుగా మార్చిందని బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్, బెస్తఈరన్న పేర్కొన్నారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా శుక్రవారం కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండలం స్టాంటన్ పురం బాలజీ స్కూలు కరస్పాండెంట్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్పట్లో స్వాతంత్ర స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. బాలజీ స్కూలు సిబ్బంది శ్రీకర్, నళిని, నాగలక్ష్మి, ముబిన, లక్ష్మిదేవి, ఝాన్సీ, రేఖ, సంగీత, సుహాసిని, సుమిత్రమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సాగు, తాగునీరు అందించాలని పాదయాత్ర

మనగళం, కోసిగి : కోసిగి మండలంలోని రైతులకు సాగునీరు తాగునీరు అందించాలని, అదేవిధంగా వలసలు నివారించాలని కోరుతూ ఈనెల 9, 10 వ తేదీ లలో పెద్దకడబూరు నుండి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలు, ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ నందు సీపీఎం కోసిగి మండల కన్వీనర్ రాముడు అధ్యక్షతన చేపట్టిన ఆటో జాత ప్రారంభ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోసిగి మండలంలో అభివృద్ధిలో అత్యంత వెనుకబడిందని సాగునీరు ఇక్కడ రైతులు కేవలం వర్షాధారం మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు బతకడానికి పిల్లాపాపలతో దూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో సాగునీరుకు అవకాశాలు ఉన్న పాలకుల నిర్లక్ష్యం కారణంగా నోచుకోవడం లేదని ఆరోపించారు. పులికను ప్రాజెక్టుకు ప్రత్యేక తూము ఏర్పాటు చేసి సాగు, తాగునీరు అందించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్న పాలకులకు మాత్రం పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఈ ప్రాంత సమస్యల్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఎం ఆధ్వర్యంలోన ఈనెల 9 10 తేదీలలో పాదయాత్రలు పెద్దకడబూరు నుండి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా పదవ తేదీ ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా చేపడుతాని, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరము ఆటో జాతకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఆటో జాత బెళగల్, చిన్న బొంపల్లి, పెద్ద బొంపల్లి, ఐరన్ గల్లు, జంపాపురం, సజ్జలగుడం, దిద్ది కోల్మన్పేట, ఆర్లబండ, కామన్ దొడ్డి, కందుకూరు, అగసనూరు, సాతనూరు, చిర్తనకల్ గ్రామాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, రాముడు, చిన్నన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: కోడుమూరు ఎస్సై డి.వై స్వామి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు కోడుమూరు ఎస్సై డివైస్ స్వామి తగు సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా ఉండాలని, కూలీలను గాని స్కూలుకు తీసుకెళ్లే పిల్లలు గాని, ఏవైనా వస్తువులను గాని పరిమితికి మించి తీసుకెళ్లకుండా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాల నిండిన వారు మాత్రమే ఆటోలు నడపాలని, ఆటో డ్రైవర్లు అందరూ కూడా డ్రైవింగ్ లైసెన్సు తప్పక ఉండాలని, మద్యం సేవించరాదని, మహిళల పట్ల, వృద్ధుల పట్ల గౌరవం చూపెట్టాలని, ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.



## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే కు వినతి



మనగలం : సున్నిపెంట : వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అతిథి గృహం నందు టి యు సి ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై ఆశీర్వాదం సీనియర్ రిపోర్టర్ రాయల విజయ్ ఆయన కలిసి వినతి పత్రం ఇచ్చి ఆయన సన్మానించి ఆయనతో మాట్లాడుతూ సుండి పెంట గ్రామంలో దళిత కాలనీ లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఇప్పటికీ 15 రోజుల నుంచి మంచినీళ్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని. అదేవిధంగా సుండి పెంట ప్రభుత్వ హాస్పిటల్ నందు ఎమర్జెన్సీ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని. అదేవిధంగా శ్రీశైలం దేవస్థానంలో దాదాపు 2000 పైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని అదనంగా సుండి పెంట నుండి అధిక శాతం. వస్తున్నారనిగతంలో శ్రీశైలం దేవస్థానం ఉచిత బస్సులు దేవస్థానం ఏర్పాటు చేసిందని ఉన్న పలం గా ఆ బస్సులు ఎత్తేయడంతో కార్మికులు పనులకు పోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉచిత బస్సులను ప్రారంభించాలని ఆయన కోరడం జరిగింది స్పందించిన ఆయన మీ సమస్యలు పరిష్కరింప బడేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

మనగళం, కర్నూలు సిటీ : భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు, రూ. 10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కమలా దేవి తీర్పు చెప్పారు. శిక్ష పడటంలో కీలకంగా వ్యవహరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులను, కోర్టు కానిస్టేబుల్ సిబ్బందిని ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దాయి శ్రీనివాసులు అతని భార్య లక్ష్మీదేవి 2007 లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలోని శివప్ప నగర్ లో నివాసం ఉంటున్నారు. భర్త శ్రీనివాసులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీ స్టాల్ పెట్టుకొని జీవించేవాడు. ఇతనిపై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ లో రౌడీ షీట్ ఉంది. అయితే పెళ్లి అయినటువంటి 11 సంవత్సరాల తర్వాత తన భార్య యొక్క ప్రవర్తన మీద అనుమానం ఉండి తరచూ గొడవలు పడుతూ 2018 నవంబర్ 18 తేదిన తన భార్యని భర్త శ్రీనివాసులు గొంతు నులిమి చంపడం జరిగింది. ఈ విషయం పై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ లో క్రైమ్ నెంబర్ 415/ 2018 కింద మర్డర్ కేసు గా నమోదు చేశారు. అప్పట్లో దర్యాప్తు అధికారి గా సీఐ డి. మహేశ్వర్ రెడ్డి ఉన్నారు. ఛార్జ్ షీట్ వేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును విచారించిన పిదప నేరం ఋజువు కావడం తో ముద్దాయి అయిన శ్రీనివాసులు పై జీవిత ఖైదు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కమలా దేవి తీర్పును ఇవ్వడం జరిగింది. కేసు వాధించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. సరళాదేవిని, కేసు నమోదు చేసి పక్కాగా దరాప్తు చేసిన కర్నూలు డీస్పీ బాబు ప్రసాద్, కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహాను, సాక్షులను కోర్టు యందు హాజరు పరిచిన ఏఎస్సై సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ ఎమ్. వెంకటరమణ లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు

## కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నందు మొట్టమొదటి సిజేరియన్ ఆపరేషన్





మన గళం కోడుమూరు: పింజరి అది మాజీ వైఫ్ ఆఫ్ పెద్ద హుస్సేన్ దంపతులు అనకొండ గ్రామం వాస్తవులు వాస్తవ్యులు కోడుమూరు మండలం కర్నూలు జిల్లా వాస్తవ్యులు ఈరోజు ఉదయం కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం మనకు మూడవ కానుక కాన్పు వచ్చారు వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు గైనకాలజిస్ట్ సాగరిక మేడం గారు పరీక్షించి వైద్య పరీక్షలు అన్నీ చేసి పోస్ట్ డాట్స్ డెలివరీ డేట్ బడుగు దాటిపోయిన దాటిపోయినందున నొప్పులు లేవు కాబట్టి సర్జరీ యెన్ ఆపరేషన్ కొరకు అనగా సెవెన్ 25 న 1.40 అడ్మిషన్ చేసుకున్నారు డాక్టర్ నాగరాజు సూపర్డెంట్ గారి పర్యవేక్షణలో డాక్టర్ గిరి భాస్కర్ సార్ డాక్టర్ మరియు గైనకాలజిస్ట్ డాక్టర్ సాగరిక మేడం గారు 7 11 25న 3 8%జూఎ% కి సెట్వియన్ ఆపరేషన్ ద్వారా ఆర్డర్ శిశువుకి జన్మని జన్మించడం జరిగింది. ఇది మూడవ కాన్పు తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ అడ్మిషన్లు డాక్టర్ నాగరాజు సార్, డిడిఓ డాక్టర్ సాగరికపై సాగరిక గైనకాలజిస్ట్ డాక్టర్ గిరిభాస్కర్లు అనస్తీసియా డాక్టర్ పెద్దయ్య ఎంబి ఎంబిబిఎస్ కు కె లక్ష్మీ హెగ్డే ఎన్ హేమలత ఓటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ అవకాశాన్ని కొడుకు నియోజవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని డాక్టర్ నాగరాజు తెలిపారు.


## వైభవంగా జరిగిన శ్రీ శ్రీ శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి 24వ వార్షికోత్సవ వేడుకలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానికంగా గల అభయ ఆంజనేయ స్వామి భక్త మండలి ఆధ్వర్యంలో మారుతి హిల్స్ వెంకటేశ్వర కాలనీ కోడుమూరు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా 7-11-25 శుక్రవారం ఉదయము 9 గంటలకు శ్రీ గణపతి పూజ పుణ్య హవాచనం కలశాస్థాపన నవగ్రహ పూజ రుద్రాభిషేకం సహిత రుద్ర హెూమములు జరిపిన తదనంతరం మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి ప్రసాద వితరణ కార్యక్రమం పురజనులు మరియు శ్రీ అభయాంజనేయ స్వామి భక్తబృందం వీరి ఆధ్వర్యంలో ఘనంగా 24 వ వార్షికోత్సవం జరిగింది



## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాటసాని

మనగళం, కర్నూలు సిటీ : కోట్ల హరిచక్రపాణి రెడ్డి కుమారుడు కోట్ల కిరణ్ రెడ్డితో బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి కుమార్తె ఆర్యతో వివాహం జరిగింది. కడప పట్టణం మేడా కన్వెన్షనల్ జరిగిన ఈ శుభకార్యానికి కాటసాని సోదరులు వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## ఇంటి వద్దే వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అవగాహన కల్పించిన ఎంపీడీవో ఏసీ రాముడు

మన గళం కోడుమూరు: ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే అవసరమైన ప్రభుత్వ సేవలు పొందవచ్చు అని కోడుమూరు ఎంపీడీవో ఏసీ రాముడు ప్రజలకు వివరించారు శుక్రవారం రోజు ఉదయం వర్కూరు గ్రామం నందు వాట్సాప్ గవర్నమెంట్ ద్వారా ప్రజలకు సేవలు అందించే విధానంపై సచివాలయం సిబ్బంది తో కలిసి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. వారికి కావాల్సినటువంటి సేవలను వారి ఫోన్ ఉండే వాట్సాప్ ద్వారా గవర్నమెంట్ నుండి సేవలు పొందవచ్చు అనేటువంటి అంశాన్ని ప్రజలకు సచివాలయం సిబ్బంది తెలియజేశారు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వివిధ సేవలు వాట్సాప్ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు మెసేజ్ పంపడం ద్వారా వివిధ సేవలు పొందవచ్చని సూచించారు. ఆదాయం, రేషన్, పింఛన్, ఆధార్ అప్డేట్, ఎలక్ట్రిసిటీ బిల్లు, ఆర్టిసి బుకింగ్, రెవిన్యూ, మున్సిపల్ సేవలు తదితర సేవలు పొందవచ్చు అన్నారు. సర్టిఫికెట్ల పైన క్యూఆర్ కోడ్ ఉంటాయని వాటిని స్కాన్ చేస్తే వాటి వివరాలు అధికారిక వెబ్సైట్లో



ప్రత్యక్షం అవుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకరించాలి

– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి





మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో కార్పొరేట్ సంస్థలు జిల్లా అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సూచించారు. శుక్రవారం సాయంకాలం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ లెవెల్ సి ఎస్ ఆర్ రివ్యూ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జిల్లా పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉందని , ప్రధానంగా జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి జిల్లాలో ఉన్న కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ నిబంధనల మేరకు తమ సంస్థల లాభాల నుండి రెండు శాతం నిధులను కేటాయించాలని కోరారు. ఈ నిధులను ఒక పద్ధతి ప్రకారం జిల్లా యంత్రాంగం సూచనల మేరకు వెచ్చించాలని వారిని కోరారు. ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను సమర్పించాలని జిల్లా పరిశ్రమల జీఎం ను ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీఓ భారతి, గ్రీన్ కో సంస్థ నుండి బాషా, శరత్చంద్రరావు , టీజీవి ఇండస్ట్రీస్ నుండి రాఘవేంద్ర రెడ్డి ,రాజేష్ కుమార్, హరి కిషోర్, జయరాజ్, ఇస్పాత్ నుండి అరవింద్ , మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ శ్రీనివాస్, ఆదాని విల్మార్ నుండి రామమూర్తి, అర్సలర్ మిట్టల్ ఏ ఎమ్ గ్రీన్ ఎనర్జీ నుండి లక్ష్మీకాంత్, జిల్లా అధికారులు జి.ఎం. డిస్టిక్ ఇండస్ట్రీస్ అశోక్ కుమార్, డి డి జవహర్ బాబు, ఏడీ డేనియల్, జెడ్ఎం.మధుసూదన్, నాబార్డ్ మేనేజర్ సుబ్బారెడ్డి, డి ఎం హెచ్ ఓ భాస్కర్, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి హనుమన్న , లేబర్ ఆఫీసర్ సీతా లక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదోనిలో ఆసుపత్రి లో అంబులెన్స్ లను మెయింటెనెన్స్ చేయడానికి అనుమతి ఇవ్వండి: భగత్ సింగ్ ఫౌండేషన్

మనగళం, కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వ డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారికు వినతి పత్రం ఇవ్వడం ఇచ్చారు భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ నాయకులు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ యం.తాహేర్ వలి, ఫౌండేషన్ కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెండు అంబులెన్సులను గతంలో ప్రజలకు సేవలు అందించడం జరిగింది. ప్రస్తుతం అంబులెన్స్ లనుంచి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పేదలకు సేవలు అందించడం లేదు భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ కు ప్రభుత్వం అనుమతి ఇస్తే మెయింటెనెన్స్ చేస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు సేవలు అందించాలని కోరుకుంటున్నాము. వెహికల్ కు సంబంధించిన ఇన్సూరెన్స్ , పాసింగ్ మరియు చిన్న చిన్న రిపేర్లు చేయించుకొని వాహనాలకు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ భరిస్తుందని అగ్రిమెంట్ రాసి ఇవ్వటానికి మేము సిద్ధముగా ఉన్నాము. ప్రజలకు మరింత సేవలు అందించాలన్న దృక్పథంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులలో ఉన్న పేదలకు మరింత సేవలో అందించడానికి ప్రభుత్వం అనుమతి కొరకు కోరుచున్నాము ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, పవన్,



అంజి, మోహన్, లక్ష్మన్న, బీరప్ప, గాదిలింగ, మల్లికార్జున, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# తండ్రి మె(న)చ్చిన తనయ



తరువాయి బాగాము



భవనాన్ని మరమ్మత్తులు చేయనున్నారు. సీఎం గోదామును ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి, తద్వారా యార్డుకు ఆదాయమొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏ.సి.గోదాము పున:నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. యార్డులో అసాంఘిక కార్యకలాపాలు,దొంగతనాల నివారణకు మరో 15 మంది సెక్యూరిటి గార్డులను తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపారు. అలాగే కూరగాయల మార్కెట్ లో సి.సి.కెమెరాల ఏర్పాటుకు ప్రపోజల్స్ సిద్ధం చేశారు. పదోన్నతి వస్తే జె.డి.స్థాయికి : ప్రస్తుతం డి.డి.స్థాయిలో ఉన్న తాను పదోన్నతులు అంది వస్తే జాయింట్ డైరెక్టర్ అయ్యే అవకాశముంది.

మహిళాభ్యుదయవాది : మహిళలు ఎవ్వరైనా సెల్ఫ్ సస్టేయినబిలిటి సాధించాలని తాను చెబుతుంటారు. పరాన్నజీవిగా కాకుండా ఇండిపెండెంట్ గా సొంత కాళ్లపై నిలవాలంటారామె. ఉన్నత విద్యలను చదివి,ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకుని, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తే..మహిళలు మహరాణుల్లా జీవితాలను గడపవచ్చంటారామె.



రైతన్నల..పక్షపాతి : తాను నిస్సందేహంగా రైతన్నల పక్షపాతి. రైతులు తనను తన కార్యాలయంలో నేరుగా కలిసి, తమ సమస్యలను చెప్పుకునే వెసులుబాటును కల్పించారామె. అందు కోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తన ఛాంబర్లో ఉంటూ రైతన్నల సమస్యలను ఓపిగ్గా వింటూ, తక్షణ పరిష్కారానికి తాను అహరహం శ్రమిస్తున్నారు.



నిరంతర సేవకురాలే : తనను కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు సంబంధిత సమస్యలపై ఎవ్వరైనా తన కార్యాలయంలోని తన చాంబర్లో ప్రతి రోజు ఉదయం,సాయంత్రం వేళల్లో నేరుగా కలిసి, తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కారాన్ని పొందవచ్చంటారామె. అలా వీలు కాని పక్షంలో తన మొబైల్ నెంబర్ : 91823 61163 లోనైనా సంప్రదించవచ్చంటోన్న తాను...ఓ..సమాజహితైషి.

జీవితాశయం : ఏనాటికైనా...తన జీవిత చరమాంకంలోగా

అనాథాశ్రమాలునిరాశ్రయులకు ఆశ్రమాలను ఏర్పాటు చేసి, సంతానం పట్టించుకోని ముసలి వారిని, ఎవ్వరూ లేని అనాధలకు ఆశ్రయమిచ్చి, వారి బాగోగులు చూసుకుంటూ సమాజ సేవలో తరించాలన్నదే తన జీవితాశయమంటోన్న..తాను నిస్సందేహంగా ఎవ్వరూ కాదనలేని, కాదన వీలు కాని...ఓ..మానవతావాది, మనస్సున్న మనిషే.





## పేటీఎం లావాదేవీలకు గోల్డ్ సర్ప్రైజ్!




న్యూఢిల్లీ, నవంబర్ 7, మన గళం : డిజిటల్ చెల్లింపు వేదిక పేటీఎం తన వినియోగదారుల కోసం చాలా ఆకర్షణీయమైన పథకాన్ని ప్రారంభించింది. యాప్ ద్వారా చేసే లావాదేవీలపై బంగారం కాయిన్స్ సంపాదించే అవకాశం ఇప్పుడు వారికి ఉంటుంది. పేటీఎం యాజమాన్యంలోని వన్97 కమ్యూనికేషన్స్ గురువారం తన లాయల్టీ పాయింట్లను డిజిటల్ బంగారంగా మార్చుకోవచ్చని ప్రకటించింది. స్మార్ట్ అసిస్టెంట్లను కలిగి ఉన్న తన ట్రావెల్ ప్లాట్‌ఫామ్ కొత్త వెర్షన్‌ను కూడా కంపెనీ ప్రారంభించింది. %ఖుఖ్ఎ% వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మాట్లాడుతూ.. %ఖుఖ్ఎ%లో చేసే %ూ2ూ% (వ్యక్తి నుండి వ్యక్తికి), యూపీఐ చెల్లింపులు ఇప్పుడు "గోల్డ్"గా మారాయని అన్నారు. అంటే ప్రతిసారీ వినియోగదారుడు డబ్బు పంపినప్పుడు లేదా యాప్ ద్వారా చెల్లింపు చేసినప్పుడు వారికి గోల్డ్ పాయింట్లు రివార్డ్‌గా అందుతాయి. ఈ పాయింట్లను తరువాత డిజిటల్ గోల్డ్‌గా మార్చవచ్చు. "%ఖుఖ్ఎ%లో ప్రతి చెల్లింపు ఇప్పుడు బంగారం సంపాదించడానికి ఒక మార్గం ఉంది. మరే ఇతర యాప్ ఈ స్థాయి రివార్డులను అందించదు. మీరు ఎంత బంగారం సంపాదించవచ్చనే దానికి పరిమితి లేదు" అని విజయ్ శేఖర్ శర్మ అన్నారు.

బంగారం మార్పిడి రూ.15 నుండి ప్రారంభం:

15 రూపాయల విలువైన తర్వాత వినియోగదారులు తమ పాయింట్లను బంగారంగా మార్చుకోవచ్చని కంపెనీ పేర్కొంది. అంటే వినియోగదారు చెల్లింపు లేదా కొనుగోలు చేసిన వెంటనే వారి ఖాతాలో బంగారు పాయింట్లు జోడిస్తారు. వాటిని తరువాత రీడీమ్ చేసుకోవచ్చు. పేటీఎం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జుగల్ తివారీ మాట్లాడుతూ, వినియోగదారులు ప్రతి రూ.100 ఖర్చుకు ఒక గోల్డ్ పాయింట్ సంపాదిస్తారని అన్నారు. రూపే కార్డు ఉపయోగించి చెల్లింపు చేస్తే పాయింట్లు రెట్టింపు అవుతాయి. రూ.1 విలువైన డిజిటల్ బంగారం కోసం 100 గోల్డ్ కాయిన్లను రీడీమ్ చేసుకోవచ్చు.

## భారత జాతీయ పతాకానికి 150 ఏళ్లు

- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి ప్రతీక




న్యూఢిల్లీ, నవంబర్ 07, మన గళం : భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకం ఆవిష్కృతమై నేటికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1875 నవంబర్ 7న బంకిం చంద్ర ఛట్టోపాధ్యాయ రాసిన 'వందేమాతరం' పాట దేశమంతటా జాతీయ చైతన్యాన్ని రగిల్చింది. ఆ పాట గీతం ప్రజల్లో దేశభక్తి జ్వాలను నింపి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలకు నాంది పలికింది.

భారత జాతీయ పతాకం రూపుదిద్దుకోవడం అనేది గొప్ప చరిత్ర. ఎన్నో రూపాంతరాల అనంతరం చివరికి ప్రస్తుత త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ 22 జూలై 1947న ఆమోదించింది. స్వతంత్ర భారతదేశం జనవరి 24, 1950న దీనిని అధికారిక జాతీయ పతాకంగా ప్రకటించింది. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు, మధ్యలో అశోక చక్రయిదేశ సమానత్వం, శాంతి, ధర్మం,

ధైర్యం, దేశ ఐక్యతను ప్రతిబింబిస్తాయి.

ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, క్రీడా రంగం నుంచి అంతరిక్షం వరకు ప్రతి విజయ సందర్భంలో భారత దేశం గర్వంగా ఎగురేసుకునే త్రివర్ణ పతాకం, కోట్లాది భారతీయుల హృదయాల్లో దేశాభిమానం నింపుతూనే ఉంది. ప్రపంచ వేదికపై భారతదేశం సాధించిన ఎన్నో విజయాలకు ఈ పతాకమే మార్గదర్శక స్ఫూర్తి.



దేశంలో పతాక పట్ల గౌరవ భావన పెంపొందించేందుకు ప్రభుత్వం, పాఠశాలలు, యువజన సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా 'హర్ ఘర్ తిరంగా' వంటి ఉద్యమాలతో జాతీయ గర్వాన్ని మరింత బలపరుస్తున్నారు.

భారత జాతీయ పతాకం కేవలం ఒక వస్త్రపు ముక్క కాదుబీ అది త్యాగం, పోరాటం, గౌరవం, బాధ్యతలకు ప్రతీక. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులను స్మరింపజేసే ఈ త్రివర్ణం శాశ్వతంగా భారతదేశ గౌరవ చిహ్నంగా నిలిచిపోనుంది.

# తండ్రి మె(న)చ్చిన తనయ

- మధ్య తరగతి కుటుంబాన జన్మించారు
- ఉద్యోగ నేపథ్యమున్న ఇంట పెరిగారు
- స్వతహాగా బాల్యం నుంచి మంచి  చదువరే
- పవిత్రమైన వైద్య రంగాన స్థిరపడాలని కలలు గన్నారు
- తండ్రి కోసం తన లక్ష్యాన్ని వీడారు
- ఉన్నత విద్యలను అభ్యసించారు
- ప్రైవేటు అధ్యాపకురాలిగా పని చేస్తూనే గ్రూప్స్ కు సొంతంగా ప్రిపేరయ్యారు
- గ్రూప్స్ లో విజేతయ్యారు
- ప్రభుత్వోద్యోగి గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు
- విధుల నిర్వర్తణలో చిత్తశుద్ధి,అంకితభావాలు ప్రదర్శించారు
- పని చేసిన ప్రతి చోటా సమర్థురాలిగా రైతుల,వ్యాపారుల మెప్పు పొందారు
- తన పని తీరుతో ఉన్నతాధికారుల ప్రశంసలకు పాత్రురాలయ్యారు
- మార్కెట్ యార్డుల్లో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు
- అ(రి)వార్డులను అందుకోగలిగారు
- ఆర్థిక స్వావలంబనే మహిళలకు రక్ష అంటోన్న.. మహిళాభ్యుదయవాది
- రైతుల వెతలను సత్వరమే తీర్చేందుకు ప్రాధాన్యమిస్తోన్న రైతన్నల..పక్షపాతి
- అన్నదాతలు,వ్యాపారులకు అందుబాటులో ఉంటోన్న..సేవకురాలే
- అనాథల సేవలో తరించాలని యోచిస్తోన్న...మానవతావాది

...మితభాషి,నిగర్వి,నిరాడంబరురాలు..కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి..జీవిత విజయ నేపథ్యమిది...

(యస్.బి.నందకిషోర్,సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ నెంబర్ : 80087 88416 )



(మన గళం,కర్నూలు) :

"...అనుకోలేదని...ఆగవు కొన్ని,..అనుకున్నామని జరగవు..అన్నీ..అంటుంటారు పెద్దలు. అది అక్షరసత్యమని ఆచరణలో నిరూపించారామె. చిన్ననాటి నుంచి తనకున్న లక్ష్యాన్ని తన తండ్రి కోసం త్యజించి, ఆయన ఆకాంక్షకు విలువిచ్చి,అందుకు అహరహం శ్రమించి..మలి లక్ష్యాన్ని అందుకున్న కార్యసాధకురాలామె. ముళ్లబాట లాంటి జీవిత ప్రస్థానాన అనూహ్యంగా ఎదురయ్యే అవాంతరాలను సమయస్ఫూర్తితో అధిగమిస్తూ,తన జీవితాన్ని పూలబాటగ మలచుకున్న..నేర్పరి తాను. అధ్యాపకురాలిగా ప్రైవేటు రంగాన తన ప్రస్థానాన్ని ప్రారంభించిన తాను..సొంతంగా గ్రూప్స్ కు ప్రిపేరై,అందులో రాణించి,ప్రభుత్వోద్యోగాన్ని పొందిన ఘన చరిత తన సొంతం. విధుల నిర్వర్తణలో చిత్తశుద్ధి,అంకితభావాలకు ప్రాధాన్యమిస్తూ,అన్నదాతల సంక్షేమానికి, రైతన్నల శ్రేయస్సుకు అహరహం శ్రమిస్తోన్న...'వి'జయలక్ష్మి తాను. తానే..కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి..ఆర్.జయలక్ష్మి. తన జీవిత విజయ ప్రస్థానంలోని పలు విశేషాల సమాహారం...మన గళం పాఠకులకు..ప్రత్యేకం..."



## విధుల నిర్వర్తణలో 'వి'జయ..లక్ష్మే... అన్నదాతల పాలిట అభయప్రదాత విధి నిర్వహణలో అదరరు బెదరరు...ఎవరైనా, ఎందాకానైనా...

స్వగతం :
పూర్తి పేరు : ఆర్.జయలక్ష్మి
తల్లి,దండ్రులు : పద్మావతి,వీరప్ప దంపతులు
స్వస్థలం : కర్నూలు
పుట్టిన తేదీ : 1979

కుటుంబ నేపథ్యం : వారిది మధ్య తరగతి కుటుంబం. తన తండ్రి ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లో ఉద్యోగిగా పని చేసేవారు. తన తల్లి కుటుంబ కార్యకలాపాల నిర్వర్తణలో తన తండ్రికి చేదోడు,వాదోడుగా ఉండేవారు. వారు వారి తల్లి,దండ్రులకు మొత్తం నలుగురు సంతానం. సంతానంలో తానే పెద్దవారిగ జన్మించారు. తనకు 1సోదరుడు,2 సోదరీమణులున్నారు.

కుటుంబం : తన జీవిత భాగస్వామి పేరు మధుసూదన్ రావ్, తాను సివిల్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు. ఆ దంపతులకు మొత్తం ఇద్దరు సంతానం. తాను కుటుంబ కార్యకలాపాలను చూసుకుంటూనే, అధికారిణిగానూ రాణిస్తున్నారు.

విద్యాభ్యాసం : తాను పదో తరగతి, ఇంటర్ కోర్సులను కర్నూలు నగరంలోని స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల,కళాశాలో చదివారు. డిగ్రీ కోర్సును నగరంలోని స్థానిక పాతబస్తీలో ఉన్న హజీరా డిగ్రీ కళాశాలలో చదివారు. ఆనక పి.జి.కోర్సును తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ నుంచి, యం.ఫిల్.కోర్సును ఎస్కె యూనివర్శటీ,అనంతపురం నుంచి పూర్త చేశారు.

మంచి..చదువరే : తాను విద్యార్జనలో స్వతహాగా మంచి చదువరే. చిన్ననాటి నుంచి విద్యార్జనలో తరగతి గదుల్లో అన్నింటా ముందుండేందుకు ప్రాధాన్యమిచ్చేవారు. కాబట్టే గ్రాడ్యుయేషన్ లో డిస్టింక్షన్ సాధిచారు. అలాగే యం.ఫిల్.కోర్సులోనూ గోల్డ్ మెడల్ ను తాను అందుకున్నారు.

తొలి లక్ష్యం దారి తప్పి,మలి లక్ష్యసాధకురాలయ్యారు : తాను చిన్ననాటి నుంచి ఎంతో పవిత్రమైన వైద్య రంగాన స్థిరపడాలని ఆశించారు. అయితే..తన తండ్రి తనను గ్రూప్స్ కు ప్రిపేరవ్వాలని సూచించడంతో తన తండ్రి కోర్కెను మన్నించి,ఆ దిశగా చదవును కొనసాగించారు.



రుచి-అభిరుచి : తాను శాఖాహార,మాంసాహారాలను తీసుకుంటారు. అయితే ఎక్కువగా సాత్వికాహారానికే ప్రాధాన్యమిస్తారు. మాంసాహారాన్ని మితంగా వినియోగిస్తుంటారు. ఇక అభిరుచులంటే..తన 8వ తరగతి చదువుతున్న నాటి నుంచే తనకు పుస్తక పఠనమంటే మక్కువ ఎక్కువ. ఈ నేపథ్యంలో అప్పటి నుంచే లైబ్రెరీలకు వెళ్లేవారు. అంతే కాకుండా శ్రావ్యమైన సంగీతమంటే తగని మక్కువ.

స్ఫూర్తి-ఆదర్శం : ఇంకెవ్వరు ? తన తండ్రే తనకు స్ఫూర్తి ప్రదాత, ఆయనే తనకు ఆదర్శం. తనను గ్రూప్స్ రాసి, ప్రభుత్వోద్యోగాన్ని సాధించాలని అనునిత్యం చెప్పేవారు.

బాధ-ఆనందం : 2001లో తన తండ్రి హఠాణ్మరణం తనను ఎంతగానో బాధించింది. ఓ విధంగా చెప్పాలంటే సుధీర్ఘ కాలం పాటు తనను ఎంతగానో కలచివేసింది. ఆనందించిన సందర్భాలంటే తనకు ప్రభుత్వ ఉద్యోగం రావడం,వివాహం,సంతానం...ఇలాంటివే.

ప్రైవేటు అధ్యాపకురాలు : తన విద్యాభ్యాసానంతరం తాను కర్నూలు నగరంలోని శంకరాస్,జయేంద్ర డిగ్రీ కాలేజీల్లో ప్రైవేటు అధ్యాపకురాలిగా పని చేశారు. ఆనక 2002 నుంచి 2008 దాకా కర్నూలు నగరంలోని స్థానిక పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి వద్ద ఉన్న హజీరా డిగ్రీ కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేశారు. ఇక్కడ విశేషమేంటంటే..తాను ఒకప్పుడు విద్యనభ్యసించిన కళాశాలలోనే అధ్యాపకురాలు కావడం.

ఉద్యోగ ప్రస్థానం : తాను 2008లో గ్రూప్స్ రాశారు. ప్రిలిమ్స్ లో ఎంపికయ్యారు. అదే ఏట సెక్రెటరి గ్రేడ్-3గా ప్రభుత్వోద్యోగాన్ని పొందారు. తన తొలి పోస్టింగ్ ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో, అటు నుంచి డోన్, నందికోట్కూరు,ప్రొద్దుటూరు,ఆంధ్ర సైడ్ కూడా చేశారు. 2009 నుంచి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఇంఛార్జ్ గా పని చేశారు. 2019లో పదోన్నతిపై సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరిగా నేటికీ విధులు నిర్వర్తిస్తున్నారు.

అ(రి)వార్డులు : తాను డోన్,ఎమ్మిగనూరు,కర్నూలు నగరంలో పని చేస్తున్నప్పుడు పలు మార్లు అవార్డులు,ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

సినిమాలు : తక్కువగా చూస్తుంటారు. ఆధ్యాత్మికమైన,సందేశాత్మక,వినోద చిత్రాలను వీక్షించేందుకు ప్రాధాన్యమిస్తుంటారు.

బెస్ట్ ఫ్రెండ్స్ : తాను మితభాషి కావడంతో తనకు హితులు,సన్నిహితులు తక్కువే.



సమర్థురాలే : మార్కెట్ యార్డు అధికారిణిగా తాను పని చేసిన ప్రతి చోటా తనదైన శైలిలో పని చేశారు. ఎన్.ఇ.ఎం.ఎల్.సాఫ్ట్ వేర్ను తాను ఎమ్మిగనూరు యార్డులో పని చేసినప్పుడు పరిచయం చేశారు. ఆనక ఈనామ్ సాఫ్ట్ వేర్ ను సైతం అందుబాటులోకి తెచ్చారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆనియన్,డ్రైఛిల్లీ కాకుండా 11 రకాల వ్యవసాయ ఉత్పత్తులు ఈనామ్ వ్యవస్థలోకి తీసుకువచ్చారు. 2019 డ్రైఛిల్లీని, 2020 లో ఆనియన్ ను కూడా ఈనామ్ పరిధిలోకి తీసుకువచ్చారు. దాదాపుగా 3 నెలల పాటు ఈనామ్ వ్యవస్థపై అలుపెరుగక శ్రమించి, రైతులు,కమీషన్ ఏజెంట్లు,వ్యాపారుల్లో అవగాహన కల్పించి,ఉన్నతాధికారుల ప్రశంసలకు పాత్రురాలయ్యారు. ఉల్లి పంట సీజన్లో షెడ్లు నిండిపోయి, రోడ్లపై పంట నిల్వలను వేసేవారు. అలా కాకుండా సంచుల పద్ధతిని అప్పటి ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి హయాంలో తీసుకువచ్చారు. పంట ఉత్పత్తులు అధికంగా వచ్చినప్పుడు బండ్లపైనే సరుకును ఉంచి స్పాట్ టెండర్ల ద్వారా క్రయ,విక్రయాలను జరిపి,నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అందరి చేతా శభాష్ అనిపించుకున్నారు. రూ.7 కోట్ల నిధులతో సెంటర్ షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి, ఆ నిర్మాణాన్ని పూర్తి చేశారు. యార్డుకు పంట ఉత్పత్తులను తీసుకువచ్చే అన్నదాతల కోసం ఇస్కాన్ వారితో మాట్లాడి రూ.10లకే భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సదుపాయం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. యార్డుకు కొత్తగా వడ్లు,మిల్లెట్స్,మినుములను పరిచయం చేశారు. 2012లో రైతులు తమ పంట నిల్వలను నిల్వ ఉంచుకునేందుకు ఓ పెద్ద సీఎం షెడ్ నిర్మాణాన్ని పూర్తి చేయగలిగారు. అంతే కాకుండా కోల్డ్ స్టోరేజి గోదాము నిర్మాణాన్ని ప్రారంభించినా నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయింది. మొత్తం దాదాపుగా 72 మంది సిబ్బందిని సమన్వయం చేస్తూ..విధుల నిర్వర్తణలో అందరి ప్రశంసలకు పాత్రురాలవుతున్నారు. ఇస్కాన్ సంస్థ సౌజన్యంతో నాణ్యమైన భోజనాన్ని కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవన్ లో ఉన్న కిచెన్ లో వండి, కేవలం కర్నూలు వ్యవసాయ మర్కెట్ యార్డుకు వచ్చే రైతులకే కాకుండా, ఎమ్మిగనూరు,ఆదోని మార్కెట్ యార్డులకు సైతం పంపేలా సక్రమ పర్యవేక్షణ చేస్తున్నారు.

భవిష్యత్ కార్యాచరణ : మరింత పెద్ద ఎత్తున రైతులు,వ్యాపారులకు ఉపకరించే దిశగా ప్రస్తుతమున్న 40 అంగళ్ల స్థానంలో మరి కొన్ని కమర్షియల్ షాపుల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం యార్డులో కమీషన్ ఏజెంట్లకు ఉన్న 215 అంగళ్ల స్థానంలో మరో 40 షాపుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కూరగాయల మార్కెట్ యార్డులో ఓ వడ్ల కోసం ఓ జంబో షెడ్ ఏర్పాటు చేసే యోచనుంది. నగరపాలక సంస్థ యంత్రాంగంతో చర్చించి,వేస్ట్ కన్వర్జేషన్ కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. రైతు విశ్రాంతి

7లో





Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310